

# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జులై 2014

సంపుటి : 20 (234) సంచిక : 7




# ఉమ్మడి కుటుంబం వలదన్నారు!

## ఇరుగు పొరుగులతో ఇష్టముగా ఉంటే రోషాలు ద్వేషాలు పెరగవు! వంటికి ఇంటికి ప్రమాదం కలుగదు!

**పెడదారి పడకు మనసా; నీ దారి విడువకు మనసా–** అంటూ మనసు అదుపులో పెట్టుకోవలసిన సందర్భములు వస్తాయని ముందే చెప్పారు ఓ సినిమా కవి.

"ఇరుగు పొరుగుల ద్వేషాలూ! పెరిగించితే రేగు రోషాలు! మరిచిపో ఇక మత్సరాలూ! పొరుగు సేమమె నీకు మేలు– అంటూ ఆ సినిమా కవి హెచ్చరికను కూడా చేసారు!

భారత ప్రధాని మాన్యశ్రీ నరేంద్రమోడి అదే ధర్మపదంగా నెంచి, స్నేహగమన పదగమనం ప్రారంభించారు. ఇరుగుపొరుగు దేశాలతో మైత్రిని పొసగించుకుంటే అధః పాతాళానికేగిన 'శాన్తి' బుస్సున పాతాళగంగలా పొంగివస్తుంది. పరాజయములన్నీ పటాపంచలమై జయఘోషలు వినిపిస్తాయి.

**వెడలిపో వెడలిపో వైషమ్యమా! కదలిరా కదిలిరా స్నేహహస్తమా–**

–యని ప్రజలు ప్రజలు చేతులు కలుపుతారు. ఆనాడు వైషమ్యాలను పెంచే రాజకీయనాయకులు గద్దె దిగి వస్తారు.

ఎదచూపి, ఎదురించి, ఎదురుదెబ్బలు తిన్న తెలుగుజాతికి– ఇదేమైనా సమస్యా! సమస్యలకు సమస్యలు సృజించి పరిష్కరించిన సాహసవీర జాతి తెలుగుజాతి! అలాటి విక్రమ పరాక్రమములు గల తెలుగుజాతి తమ సమస్యలను పరిష్కరించుకోలేదా?

**పదపద చేయీ, చేయి, కలుపుకుని ముందుకు పోవాలి!**
**నీలాకాశపు చందమామకూ**
**నేలపై నున్న చెంగల్వ భామకూ**
**అనుబంధమున్నపుడు – మేటి**
**తెలుగు మనిషికీ తెలుగు మనిషికీ**
**బంధముంటుంది! అది ద్వేష బంధాలను పెంచదు! రోషం కల్గించదు!**
**కాలము అన్నెము పున్నెమెరుగని పసిపాప!**
**కనువిచ్చిన ఉషస్సును చూసావా**
**కలుషితం కాని బంగారమది!**

**ఇది యుగ యుగాలుగా జగజగాలకు ఉన్న జన సంబంధం! వెగటులేని వెలగట్టలేని వేల్పుల తీయని బంధం! తెలుగు జాతికి తెలుగు నేలకు, తెలుగువానికున్న అపూర్వ, అనుపమ బంధం.**

**మనసును మసిబారనీకు–**

**–హాయిగా, తీయగా, ప్రేమగాటుల ఘాటుగల తెలుగు కవుల పేరడీలు చదువు! మనసును కందనీకు!**

మాగాయా, కంది పచ్చడీ ఆవకాయా, పెసరప్పడం, పెరుగూ – ఆరగించి, ఆరోగ్యం నిలుపుకుంటూ ఆహ్లాదం పెంచుకుంటూ ఒక పంక్తిన భుజిస్తూ, భోజన భాజనలకు స్వస్తి పలికితే తెలుగు వాడంత ధీరుడుండడోయ్! అని నా హితైషిక మాట! సూచిత బాట. తెలుగు భోజ్యమంతటి రుచ్యము లేదోయ్!



**స్వస్తి! సన్మంగాళిని భవన్తు!**

బుధజన విధేయుడు


**– గోటేటి శ్రీరామారావు**

**'సత్యాశ్రమ కందశిలా శాసనం' అన్నారో వికట ప్రకటకవి! దాని నెఱుంగను గాని, సకల విద్యా సారస్వతమునకు మూలగురువు శ్రీ దక్షిణామూర్తి. విజ్ఞాన కంఠహారధరులందరికీ దక్షిణామూర్తి ఎరుక. ఆయనే విజ్ఞాన ప్రదాత. ఆయనే పరమేశ్వరుడు; ఆయనే పరమ గురువు. విజ్ఞానమనుగ్రహించమని ఆయన్ను ప్రార్థిద్దాం.**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# ఆయన 56 రోజులు ఆమరణదీక్ష చేసి అసువులు రాల్చకపోతే ఏ భాషా రాష్ట్రమూ ఏర్పడేది కాదు

పొట్టి గురవయ్య, మహాలక్ష్మి దంపతుల రెండవ సంతానంగా శ్రీరాములు 1901వ సంవత్సరంలో మార్చి 16వ తేదీన జన్మించారు. కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే ఆయన దృష్టి జాతీయోద్యమం వైపు మళ్ళింది. ముంబాయిలో విక్టోరియా టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుండి శానిటరీ ఇంజనీర్‌లో డిప్లొమా పొందిన ఆయన 'గ్రేట్ ఇండియన్ పెనిన్సులార్ రైల్వే'లో ఇంజనీర్‌గా బొంబాయిలో నాలుగేండ్ల పాటు ఉద్యోగం చేశారు. ఇంజనీర్‌గా పనిచేస్తున్న రోజుల్లో 'సీతమ్మ'తో వివాహం జరిగింది. రెండు సంవత్సరాలలోపే పురుటి బిడ్డతో సహా భార్య మరణించడంతో జీవితంపై విరక్తిచెంది, ఉద్యోగం వదిలేసి శ్రీరాములు శాంతికాముకుడుగా పరిణమించే సమయంలో 'జలియన్ వాలాబాగ్' దురంతాలు ఆయనను కలవరపరిచాయి. 'రౌలత్' చట్టానికి వ్యతిరేకంగా దేశంలో చెలరేగిన ఉద్యమంతో శ్రీరాములు



ప్రభావితుడై తన శేషజీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేయ దలచుకొని సబర్మతి ఆశ్రమం చేరుకొని గాంధీజీ అనుచరుడుగా మారారు.

గాంధీజీ పూరించిన స్వాతంత్రోద్యమ శంఖారావానికి ప్రభావితుడై గాంధీ ఆశ్రమంలోని పరివారంలో ప్రధాన సభ్యుడుగా గాంధీ ఎంపిక చేసుకున్న కొద్దిమంది సర్వోదయ సేవకులలో అగ్రగణ్యుడుగా పదకొండు సంవత్సరాలు నియమబద్ధ ఆశ్రమ జీవితం గడిపారు.

హిందూ సంస్కరణ నెలకొల్పి అస్పృశ్యతా నివారణ, బాల్య వివాహ నిషేధం, వితంతు వివాహప్రోత్సాహం మూఢాచార నిర్మూలనకు ఎంతో కృషి చేశారు. ఆంధ్రభాషా రాష్ట్రంకోసం ఆయన 56 రోజులు నిరసన దీక్షావ్రతం బట్టి అసువులు అర్పించబడడంతోనే భాషారాష్ట్రాలు ఏర్పడ్డాయ్. ●

**తెలంగాణా ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో అమరజీవి శ్రీరాములుగారిని సంస్మరిస్తారని ఆశించాం.**

# రాష్ట్రాలు రెండు! చీల్చిన పార్టీలు మెండు!!


**-ఇరువురి మనసులు ఒకటే అయినపుడు**
**ఇరు రాష్ట్రాల మనసు మనుగడలొకటి కావా? అవుతాయి**
**-ద్వేషరోషాల్మరిచినపుడే సాధ్యమవుతాయ్!!-**

వైషమ్యాలు వుత్పత్తిని సాధించలేవు; వృద్ధి సమృద్ధిలకు విఘాతం కలిగిస్తాయి. మత్సరం పాతాళం నుంచి గుప్పుమని ఎగస్తుంది. 'మనం' అనే 'నెమ్మనం' మృగ్యమవుతుంది.

మదం మృగ్యమైనపుడు నువ్వూ నేనూ అని, భర్తా భార్యా కలిసినపుడు మూడో జీవి పుడుతున్నాదు; అమ్మా నాన్నా, అన్నా – తమ్ముడు, అక్కా – చెల్లి, వదినా – బావా, చిన్నా – కన్నా – ఇరుగుపొరుగున ఉన్న రామయ్యా సీతమ్మగారు, రుక్మిణీ – కృష్ణయ్యగారు, మన వీధీ – ప్రక్క వీధీ, మన ఊరూ – ప్రక్క ఊరూ – మన మండలం – ప్రక్క మండలం, మన జిల్లా – ప్రక్క జిల్లా, మన చెరువులు – ప్రక్క చెరువులు, మన జలధులూ – వారి జలధులు– ఇలా ఇలా ఒక్కటొక్కటే ఒక్కటవుతాయ్; ఒకే మనోభావం కలిగిస్తాయి, లేదా ఒకటి రెండయి, మూడయి, నాలుగురావు– అలా 13 జిల్లాల ఓ సీమ 10 జిల్లా సీమ మనుషుల మనస్కులు కలిసిపోతే వైషమ్యాలెక్కడ ఉంటాయ్? అవి ఇటు బంగాళాఖాతములోనూ అటు అరేబియా సముద్రంలోనూ, దక్షిణమున్న హిందూ మహాసముద్రంలోనూ కలిసిపోతాయ్. శేషించిన వైషమ్యాలుంటే కొండలూ, పర్వతాల దిగువ నలిగి నలిగి 'నుసి'యై పోతాయి.

అప్పుడు భద్రాద్రి రాముడు మా వాడని ఒకరూ, సప్తగిరి వేంకటాధీశుడు మా వాడని– ఇరువురూ నంచుకోచూస్తే – భద్రగిరి రాముణ్ణి మోస్తున్న భద్రుడూ, వేంకటాధీశుణ్ణి మోస్తున్న ఆదిశేషుడూ చూసూరుకోరు; దక్షిణమునున్న కన్యాకుమారి, హిమాలయములో నున్న వైష్ణవదేవీ లిరువురూ కొందర్ని మూడు సాగరముల సంధిలోకీ, మరొకరు హిమవత్పర్వత శ్రేణి జలధుల్లోకీ త్రోసేస్తాయ్.

మన పాపాలకు శాపంగా అన్నెము పున్నెమూ యెఱుంగని వారిపై కొండల





అందలు, కుండలుగ జలధులు, పొంగి పొంగి వేలాదిమందిని చంపి మనకో శాంపిలు వార్నింగు నిస్తాయి. 'మనం' అనేది నెమ్మనంలో లేకపోతే నెమ్మదియైన 'మది' మనకుండదు. రాజకీయానికి అధిక ప్రాధాన్యమిస్తే 'రాక్షసీయం' మనల్ని రక్కిరక్కి రుధిరాన్ని ప్రవహింపచేస్తుంది. మన రుధిరం స్రవించాలా? అధర మున మధురం పండాలా? 'మనం' నయన ద్వయం చెమ్మగిల్లాలా – అనేది మన (మీ) చేతుల్లోనే ఉందని గ్రహించాలి.

**సింధూరం రక్తచందనం బంధూకం సంధ్యారాగం**
**పులిచంపిన వేడినెత్తురూ ఎగరేసిన ఎర్రజెండా**
**రుద్రాలిక నయనజ్వాలిక కలకత్తా కాళికనాలిక**
**కావాలోయ్ నవకవనానికి**

–శ్రీ శ్రీ మహాకవి మహా ప్రస్థానం సంపుటీ కవితను హృదయ పీఠికనందు మననం చేసుకోండి!

జనానికి మరణం ఉండవచ్చు; జగానికి మరణం లేదని తెలుసుకో! జగం నడతకు జనం వేడుకకు జగం నడుస్తుండాలి! జగం నడకకు 'జనం' వేడుకయిన 'మనం' అందిస్తూండాలి! ఇవే పడుగూపేకలుగ నేయబడే నిత్యనూతనవస్త్రములు! నీవు నేత్రములతో దివ్యమైన 'శాన్తి' అస్త్రమును సంధించు. ఇది జయనామ వత్సరము! జయములకిది సంకేతం! గ్రహింపు లేకుండా గర్జించావంటే రాహు (లు) కేతుగ్రహాలు పొంచి ఉంటాయి, నంజుకుతింటాయ్. రెండు రాష్ట్రాలుగా చీలినా 'మెండు'గ అభివృద్ధి మార్గాలున్నాయ్! మారుము మంచిగమారుము ఏమారముకుము! ●




# సింహాచలము - మహాపుణ్యక్షేత్రము


**- బెల్లంకొండ నాగేశ్వరరావు**

**మాతా నృసింహశ్చ, పితా నృసింహః**
**భ్రాతా నృసింహశ్చ సఖాన్నృసింహః**
**విద్యా నృసింహార ద్రవిడం నృసింహః**
**స్వామి నృసింహః సకలం నృసింహః**

అతి ప్రాచీన వైష్ణవాలయాలలో సింహాద్రి అప్పన్న సింహాచలం ఆలయాన్ని పేర్కొనాలి. విశాఖ నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో సముద్రమట్టానికి 800 అడుగుల ఎత్తున శ్రీవరహాలక్ష్మి నృసింహస్వామి దేవాలయం శోభాయమానంగా ఉన్నది. ఈ పర్వతం ఆసీనయైన సింహాకారంలో ఉండటం వలన దీన్ని 'సింహాచలం'గా పిలుస్తున్నారు.. ఈ ఆలయానికి 'కృతశౌచం' 'హరం పాపం' అనే పేర్లు కూడా ఉన్నాయి.

11వ శతాబ్దానికి చెందిన 'కులోత్తుంగ చోళుని' కాలం నుండీ ఈ క్షేత్రంలో స్వామికి సేవలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. కళింగచక్రవర్తులు, విజయ నగరాధీశులు, రెడ్డిరాజులు, వెలమనాయకులు, ఎలమంచి చాళుక్యులు, జంతరనాటి సులభ వంశీయులు, కటక వంశ సూర్యగజపతిరాజులు ఆదిగాగల నాటి పాలకులు ఈ దివ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసిన శాసనాలు నేటికీ కనిపిస్తాయి.

స్వామివారు ఇలా ... జీమూత నరసింహం, అహోబల నృసింహం, శంకర నారసింహం, రాజా నారసింహమూర్తి, యోగానందనారసింహమూర్తి, భూ వరాహమూర్తి, త్రివిక్రమమూర్తి, వ్యాఘ్రనరసింహ, పంచముఖ నరసింహం, శ్రీభూనరసింహం, చక్రనారసింహం, బిడాలనారసింహం, నృసింహమూర్తి, వ్యోమనరసింహం, యోగనారసింహం, యోగానంద నారసింహం, వరాహమూర్తి, అభయనారసింహం వంటి మొత్తం ముప్పైరెండు నృసింహ అవతారాలు ధరాతలమున ధరించారు. అవన్నీ ఈ ఆలయంలో నయనానందకరంగా చెక్కబడ్డాయి. ప్రహ్లాదుని పినతండ్రిని చంపిన శ్రీహరి వరాహఅవతారం, తండ్రి హిరణ్యకశిపుని చంపిన నారసింహ అవతారధరుణ్ణి శాంతమూర్తిగా అనుగ్రహించమని వేడుకున్నాడు. తొలుత 'అహోబిలం'లో పూజించి రాజ్యాధికారాన్ని కుమారునికి అప్పగించి 'సింహగిరి' చేరి వరాహ నర్శింహున్ని అర్చించి స్వామికృపతో ప్రహ్లా దుడు స్వర్గం చేరాడు. అటవెలసిన స్వామిపై పుట్టిపెరిగి పూజలు లేక అడవిలో అలా ఉండి పోయాడు. షట్చక్రవర్తులలో ఒకడైన పురూరవుడు తన భార్యతో వనవిహారానికై సింహాచల ప్రాంతానికి వచ్చాడు. ఆరోజు రాత్రి స్వామి తన గుర్తులు చెపుతూ తనకు ఆలయ ప్రతిష్ట చేయమని ఆదేశించారు. పుట్టను తవ్వించి వరాహ నృసింహుని దర్శించుకున్నాడు. ఆ రోజు వైశాఖ శుక్ల తృతీయ (అక్షయ తృతీయ) భక్తుల దర్శనానికి వీలుగా 364 రోజులు పుట్టకు బదులు తనపై పుట్టమన్నుకు సమతూకం కలిగిన చందనాన్ని పూయవలసిందిగా కోరి పుట్టలోనే ఉండిపోయాడు. వైశాఖ తృతీయ నాడు మాత్రమే మంగళకరమైన స్వామి దర్శనం భక్తులకు లభిస్తుంది.



ఆలయం ముంగిట
రచయిత నాగేశ్వరరావు

ఆ రోజున 'చందనలేపనం' తొలగించి, నిజరూప దర్శన అవకాశం కల్పిస్తారు. కార్తీక మాసంలో లక్షల మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టిన ఫలం సింహాద్రిపై ఒక్క విప్రునికి అన్నం పెడితే కలుగుతుందని క్షేత్రమహాత్యం చెపుతుంది. ఇక్కడ గంగధారలో పుణ్యస్నానమాచరిస్తే ప్రయాగలో మకరమాసంలో మాఘస్నానం చేసి ఫలం కలుగుతుంది. గిరిప్రదక్షిణం చేస్తే 'భూప్రదక్షిణ' ఫలం కలుగుతుందని క్షేత్రమహాత్యం చెపుతుంది.

గంగధారలో స్నానమాచరించి స్వామిపై మనసు లగ్నం చేసి 'కప్పస్థంభాన్ని' ఆలింగనం చేసుకున్నవారి కోరికలు తీరతాయని భక్తకోటి నమ్మకం. ఈ దేవాలయంలోని అపురూప కళాశిల్ప నైపుణ్యం ఆమోఘంగా ఉండి ఒకస్తంభంతో మరో స్తంభం పోలికలేకుండా, చిత్ర విచిత్రంగా మలచబడ్డాయి. నాగబంధన స్తంభం, స్తరభసుందరి, స్తంభకేసరి, గజకేసరి (ఏనుగు ముఖం, సింహం శరీరం) వంటి అనన్య అపూరూప శిల్పసంపదాదర్శనం మనచూపులను కదలనీయవు. **శ్రీ మహావిష్ణువు ఏ అవతారంలో ఉన్నా భక్తజనబాంధవుడే.** వరాహమూర్తి అహంకారం వదలిన క్షేత్రం. నఖశిఖ పర్యంతం అప్పన్న స్వామిని వీక్షిస్తూ ఆయన నామ ధ్వనిలోని మనం లీనమైతే మనం అర్పించే కైమోడ్పులను స్వామి దయామయుడై అలరింపుగా స్వీకరిస్తాడు; ఆయన కరుణా కటాక్ష వీక్షణాలు మనకు లభిస్తాయి.

శ్రీహరి ప్రజ్వల జ్యోతిపుంజమైన ఆదిత్య మండలంలో ఉంటాడని శృతి వాక్యం. అటువంటి సూర్యమండలంలో శ్రీమన్నారాయణుడు ఉన్నాడు కాబట్టి ఆయన సుందర సుకుమార దేహం కందిపోకుండా ఉండటానికి చందనలేపంతో స్వామి దర్శనం సాంత్వనం కలిగిస్తుంది.

**సుందరాయ శుభాంగాయ మంగళాయ మహౌజసే**
**సింహాశైల నివాసాయ శ్రీనృసింహాయ మంగళమ్.**



# జాతి భాషకోసం తపించిన కథా జాబిల్లి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి!

పదహారు కోట్ల తెలుగువారు– పదహారణాల తెలుగువారు ప్రపంచ దేశాలన్నిటి లోనూ ఉన్నారు. సభలకు వస్తేవారు ఆంగ్లంలోనే మాట్లాడుతారు. పేరొందిన తెలుగువారు ప్రపంచ విఖ్యాతిగొన్న సంస్థలందు తెలుగువారే శిఖరస్థానంలో ఉన్నారు. ఇంటిపేరు తెలుగింటి పేరుంటుంది. కంటికెదురుగా ఉన్న గుండ్రటి తెలుగు అక్షరాన్ని వారు చదువలేరు.

తెలుగుజాతి అదృష్టమేమో ఆయన అదృష్టమో తెలుగువానిలో తెలుగు లేమితనాన్ని చూడలేననుకున్నారేమోగాని 1961 ఫిబ్రవరి 25న దివంగతులయ్యారు. కానీ ఆయన బ్రతికున్న రోజుల్లో వాక్రుచ్చిన దిగువ పలుకులు నా వీనుల్లో తేనెపలుకుల్లా బ్రతికి ఉన్నాయ్.

**నా దృష్టిలో తెలుగుదేశమే దేశం** (రాజకీయ పార్టీ కాదు సుమండీ!)

**తెనుగు భాషే భాష! తెనుగు మనుష్యులే మనుష్యులు!**

**తెనుగు వేషమే వేషము!**

**ఏ జాతి ఎదుటా! ఏ సందర్భములోనూ!**

**ఎందుకున్నూ! నా తెనుగుజాతి తీసిపోదు!**

**ప్రపంచానికి ఉద్ఘాటించి చెప్పుకోవడానికి**

**నా సేవలు తెలుగుజాతికే మీదు కట్టుకోవాలి!** –అన్న ఈ తెలుగు భాషా పిపాసి, తాపసి ఆంధ్రప్రదేశ్ యేర్పడి అయిదు సంవత్సరాలు పూర్తిగాకుండానే– ఏ స్ఫూర్తి మనమున కలిగిందో కానీ 1961 ఫిబ్రవరి 25న ఇహలోకం వీడారు.

తాను తెలుగులోనే కవిత్వం చేయాలి! తెలుగులోనే కథలు వ్రాయాలి. తెలుగు భాషకే అంకితమై, తెలుగు రచన చేయడం కన్నా పరమార్థం ఏఁవి ఉంటుంది! తెలుగుభాష తెలుగు శ్వాస తెలుగు శోష – ఇదే తెలుగు లక్షణం అని మురిసి మెరసి పరవశించిన జీవితం శ్రీపాద సుబ్రహ్మణ్యాంద్రుని జీవశాస్త్రం.

మన మాతృభాష తెలుగు గావున మనం

'తెలుగువాళ్ళం'యని సంతృప్తి నొందాలి.

బంగాళీలు బంగాళీలే!

తమిళులు తమిళులే

ధృఢమైన జీవనాడి తెలుగులోనే ప్రచులితమవుతుంది.– వినా యితర ఊసులోకాదు; బాసలోకాదు; శ్వాసకోశమున సంబంధితమవుతుంది.

ఎవరెంత విసుక్కున్నా లాభం లేదు. తెనుగుదేశం అని ఈశ్వర నిర్దేశం. తెలుగువారిది త్రిలిఙ్గ పీఠం.

**తెలుగుజాతి మహోజ్వల సింహపీఠం**

**తెలుగుజాతికి తెలుగుభాషను బట్టే వ్యవహారం**

**తెలుగు భాష వాణి వాగ్విలాసం. ఇది స్వయంభువు**

**లోక వ్యవహారానికి భాషాప్రాతిపదిక యవుతుంది.**

**ఇది కాదనడానికి వీలులేదు.**

భాష – జాతి – దేశం – క్రమ న్యాయాలు! పూర్ణ రూపులు దిద్దుకున్న సంపూర్ణ స్వరూపం. ఇందులో ఏది క్రమం తప్పినా– తక్కినవి వికృతములే అవుతాయి.

తెనుగుభాష ఉండినపుడు – ఆ భాషను మాట్లాడే జాతి వుండినపుడు – ఆ జాతికి కాణాచియైన భూభాగం వుండినపుడు – తెలుగు భాష తెలుగుదనం, తెలుగు సంస్కృతి సంపూర్ణ స్థితిలో ఉంటుంది. మూలధ(ధ)నానికి విలువనిస్తుంది.

మన మాతృభాష మసకను వీడిపోకుండా ఉండాలంటే ఓ అంకితభావం కావాలి. ఓ ప్రేమ భావం చిగురించాలి. తాను ప్రేమించిన స్త్రీయో, పురుషుని కోసమో తల్లిదండ్రులనూ, రాజ్యాన్నీ, సంప్రదాయములను త్యాగం చేసిన జీవి 'భాష' కోసం ఆ మాత్రం త్యాగం చేయలేడా? 'చేయగలడు' అనే సిద్ధాంతి శ్రీపాద వంశోద్భవుడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సిద్ధాంతమును ఒకే వాక్యంలో చెప్పాలంటే 'నేను తెలుగువాణ్ణి అనే స్పృహ కలగాలంటారు. తెలుగువాడు సాటి తెలుగువానితో తెలుగులోనే మాట్లాడాలంటారు.



స్వచ్ఛమైన ఆంగ్లం మాట్లాడాలంటే స్వచ్ఛమైన తెలుగు రావాలి. తెలుగులోని యాభై ఆరు అక్షరాల ఉచ్చారణను స్వచ్ఛంగా పలక కలిగితే, ఆంగ్లంలోని ఫొనెటిక్ సౌండ్సు యెక్కడ సున్నితంగా యెక్కడ కొంత ధ్వనిపరంగా, మరో చోట ఆ అక్షరాన్ని మరుగుపరిచి మాట్లాడడం వస్తుందనేది శ్రీపాద వారి భాషా పాదవాదా సిద్ధాంతం.

మాతృభాష పట్ల చిన్నచూపు చూచేవాడూ తల్లిభాషను విడిచి యితర భాషను నేర్చుకొనేవాడూ, తల్లిభాషను గాకుండా యితర భాషల్లో మాట్లాడేవాడూ, తల్లి భాషలో గాకుండా ఇతర భాషలో ఆనందించేవాడూ తల్లిలేని పిల్లవాని క్రిందగా జమకట్టాలని ధీమాగా చెప్పిన సౌమ్య స్వాభావికుడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారే!

నేను ఆంధ్రుణ్ణి (తెలుగువాణ్ణి) నా పూర్వుల రక్తమే నన్ను నడిపిస్తోన్నది. భారతదేశ ప్రవర్తకుణ్ణి. ప్రపంచానికి నేను మాతృభాషా ప్రియత్వంగల ఆదర్శపురుషుణ్ణి యని చెప్పుకోగలగడమే పరమావధి కావాలన్నారాయన.

తెలుగులో విజ్ఞాన దీప్తి చెందే వాఙ్మయం వెల్లివిరియాలి. నోరువిప్పి తెలుగులో ఉత్తేజం, ఉద్రేకం కలిగే ఉపన్యాసం చేయాలి. అది భాషా ప్రయోజనకర సందేశం కావాలి.

ముందు గ్రంథాలు పట్టు. తేనెపట్టులాటి గ్రంథాలతో తపస్సుచెయ్. ఆ తరువాతనే కలంపట్టు– అన్న తెలుగు భాషాప్రియుడు కథా రచయిత సుబ్రహ్మణ్యశాస్త్రి!

**గ్రంథాలు చదివితే పదసంపద పెరుగుతుంది. గ్రంథాలు బుద్ధి మారాకు పట్టిస్తాయి. జ్ఞానసంపద కలిగిస్తాయి. పలువేత్తల సంభాషణలు వింటూ, గ్రంథాలూ పత్రికలూ చదువుతూండడం ఎడతెగకుండా రచనలు సాగిస్తుండడంతో భాషా జ్ఞానం కలుగుతూంది, భాషాభిమానం పెరుగుతూంది.**


'ప్రబుద్ధాంధ్ర' పత్రిక ద్వారా యెన్ని ప్రబోధాత్మక వ్యాసాలు వ్రాసారో– అంతగా అంతటి అత్యున్నతంగా తెలుగుభాష గొప్పదనాన్ని విశదీకరించారు. తెలుగు సాహిత్యంలోని పురాణేతిహాసాలనూ, శాస్త్ర నిర్ణయాలను, కథ, నవల, నాటక, బహురూపాల సాహిత్యాన్ని స్పృశించి, రసించి, రసింపచేసిన 'కథా చక్రవర్తి'యనే కీర్తికిరీటాన్ని ధరింపచేసుకున్న మేధావి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రాపురం సమీపంలోగల పొలమూరులో 1891 సం॥ము ఏప్రిల్ 23వ తేదీన జన్మించారు. వారి స్వగ్రామం మహేంద్రవాడ.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పుట్టినది శోత్రియమైన కుటుంబం; నిష్ఠాగరిష్టమైన వైదిక సంస్కృతీ కుటుంబం. సనాతన ధర్మపరమైన సంస్కృతీపరమైన గ్రంథాల్ను తక్క స్పృశించే అవకాశమే లేదు. యువత శిరోజాలను కుదించుకొనే క్రాఫింగుకు కూడా అనుమతించేవారు కాదు. పెద్దలు చొక్కాలను ధరించడానికి కూడా అంగీకరించేవారు కాదు. పై కండువా లేకుండా వచ్చేవారు కాదు. అలాటి సనాతనాచారం పాటించే కుటుంబంలో ఆయన కొన్ని సాంప్రదాయాలను ధిక్కరించక తప్పలేదు.

**(తరువాయి 17 వ పేజీలో)**

# చంద్రబాబు గారూ! మీరు మీ సైకిలు త్రొక్కుతూ రావడం అమావాస్య నాడు చంద్రోదయమైనట్లున్నది!

## - భారత ప్రథమ పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య సైకిలు తొక్కుతూ సభకు వెళ్ళేవాడు!!-




మీరు సైకిలు త్రొక్కుకుని రావడం ఫోటోను చూచినపుడు అమావాస్య కటికచీకట్లను చీల్చుకుని చంద్రోదయమైనట్లున్నది! మీరే సాహసమునకూ వెనుకాడనివారు!

భారత పార్లమెంటు సమావేశాలకు ప్రతిపక్షనాయకుడైన పుచ్చలపల్లి సుందరయ్య సైకిలు త్రొక్కుతూ పార్లమెంటు సమావేశాలకు వెళ్లేవాడు!

**ఒకసారి రష్యను పార్లమెంటు వర్గం భారత పార్లమెంటు సభను చూడడానికి వచ్చింది. క్రమశిక్షణాయుతంగా ఉన్న సభ్యులను చూచింది. అయితేవారికి ప్రతిపక్షనాయకుడెవరో తెలియలేదు. ఉదయం తొమ్మిది గంటలకు పార్లమెంటు వీధిలో సైకిలు తొక్కుకుంటూ వచ్చే పుచ్చలపల్లి సుందరయ్యను తనతో లానుల్లో ఉన్న రష్యన్లకు ప్రధాని నెహ్రూ చూపించగా వారు అచ్చెరువొందారు! అదీ సుందరయ్య నిరాడంబరత. అరుపులూ, చరుపులూ లేని ఆనాటి పార్లమెంటు సభ్యుల ప్రశాంతత.**

చంద్రబాబూ! మీరు సైకిలు త్రొక్కుకుంటూ వస్తున్న చందము చూసాను. నా మనసు పరిణామమేమోగానీ పొట్టలా ఉబ్బినట్లయింది. ఏడుపదుల వరసుల వయసులో అలుపెరుగకుండా రాష్ట్రమంతటా పర్యటించినవారు. ఎంతో సాహస వంతులు. ఎందర్నో కూడకట్టుకున్నారు. తెలుగుదేశం పార్టీకి జవసత్వాలు కూర్చారు. మీ మామ ఎన్టీ రామారావు గారిలా ఎందర్నో కలుపుకుని తెలుగు దేశాన్ని ఏక త్రాటికి తెచ్చారు.

మీ పెండ్లి జరిగినపుడు మద్రాసు చిల్డ్రన్సు థియేటర్‌కు వచ్చి, నా శ్రేయో మూర్తులు దారికల్పించగా- మీ వధూవరులపై అక్షింతలు వేసిన నేను పత్రికా సంపాదకుణ్ణి. మీ రాజకీయబలం మీ తోటి మిత్రుల ద్వారా- ఆనాడే గ్రహించాను. అయితే మీరు భవనంవారి మంత్రివర్గంనందు మంత్రియైన తరువాత కలుసుకోలేదు.




సింగపూరులో చంద్రబాబునాయుడుతో గోటేటి శ్రీరామారావు

మీరు ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా భారతదేశంలో కలుసుకోలేదు. సింగపూరులోనే 'ప్రముఖాంధ్ర' పత్రికా సంపాదకునిగా ఒకేసారి ఒకే నిమిషం కలుసుకున్నాను. జ్ఞాపకంగా ఆ ఫోటోను భద్రపరచుకున్నాను. మీరు పని రాక్షసులని తెలుసు. రోజుకి 18 గంటలు పనిచేస్తారు. చేయిస్తారు. మీతోటి అమాత్యుల్ని, ఐఏఎస్ ఆదిగా గల అధికారుల్ని ప్రేమగా చూసే భావనమీదని తెలుసు. అయితే మిమ్మల్ని కలుసుకోవడం నాకు చంద్రుని కోసం చకోరం ప్రయత్నించడం లాటిదే! ఆ చంద్రతారార్క కీర్తినీ, ఆరోగ్యాన్ని ఆర్జించండి! శుభమ్ భవతు. ●

ప్రముఖాంధ్ర ఒక్కటే ప్రపంచ ఆంధ్రుల పత్రిక

# స్వార్థమెరుంగని రాచబిడ్డ - తెలుగువారి తపః ఫలం!

## - చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద మూర్తిరాజు -



**1919 డిసెంబరు 16వ తేదీన బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు భద్రాద్రి రాముని వరప్రసాదంగా మన సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు జన్మించారు. వీరి బాల్యం మాతామహుల వద్ద సత్యవాడలో, తదుపరి చిన నింద్రకొలనులో నడిచింది. మాధ్యమిక విద్య తండ్రిగారు నెలకొల్పిన వివేకానంద మాధ్యమిక పాఠశాలలో పూర్తి చేశారు. మిడిల్ స్కూల్ నుండే మూర్తిరాజుగారు గాంధీజీ ప్రభావానికి ఆకర్షితులయ్యారు. తణుకులో హైస్కూల్ విద్యతో చదువు ముగిసింది. వీరిని చదువుకంటే రాజకీయాలే బాగా ఆకర్షించాయి.**

**మొగల్తూరు సంస్థానాధీశులు, నర్సాపురం తాలూకా గ్రామ భూస్వామి శ్రీరాజా దేవ ప్రసాద కుమారలక్ష్మీ నరసింహరాజ బహద్దూర్‌గారి ప్రథమ పుత్రిక సత్యవతి దేవితో 1941లో వివాహం జరిగింది. వీరు ఉండే ఇంటిని- జవహర్‌లాల్ నెహ్రూ ఇంటి నమూనాలో రెండంతస్థుల భవనాన్ని కేవలం 30 రోజులలోనే నిర్మాణం పూర్తిచేయించారు. దీర్ఘకాలం ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించిన మూర్తిరాజుగారు 2012 నవంబరు 12న ఫతేపురంలోని స్వగృహంలో కన్ను మూశారు.**

మూర్తిరాజు అంటేనే చాలు ఆంధ్ర జగద్విఖ్యాత రాజు.

పద్దెనిమిది వందల ఎకరాల భూమిని దానధర్మాల కొఱకే వినియోగించిన దానశీలుడు. ఖద్దరు టోపీ విలువను నిలబెట్టిన మహనీయుడు. సిసలైన సర్వోదయ నాయకుడు. (గత సంచికలో వెలువడించని విషయాల నిండు వివరిస్తున్నాం.)

అఖిలభారత సర్వోదయ సమ్మేళనం చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో తానే ఆ పనిని 1961 సం. ఏప్రియల్ 17, 18, 19 తేదీలలో ఎన్ని అడ్డంకులున్నా నిర్వహించారు. ఇందుకుగాను ఉంగుటూరు సర్వోదయం వద్ద తాత్కాలిక రైల్వే స్టేషను ఏర్పాటు చేయించారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాష్ నారాయణ్ వంటి అతిరథ మహారథులెందరో ఈ మహాసభలకు హాజరయ్యారు. మహాత్మాగాంధీ పట్ల మూర్తిరాజుగారికి ఎనలేని గౌరవం! దైవాన్ని ఆరాధిస్తారో లేదో తెలియదుగాని గాంధీ మహాత్ముడే ఆయనకు ప్రత్యక్ష దైవం. మనసా, వాచా, కర్మణా నిత్యం గాంధీ స్మరణే ఆయనకు ఆనందదాయకం. 1968లో భారత్ సేవక్ సమాజ్ అధ్యక్షులుగా 600 మైళ్ళ పాదయాత్ర చేసి గాంధీజీ ఆదర్శాలను గ్రామ గ్రామాన ప్రచారం చేసి, శత జయంతి సందర్భంగా బృహత్తర ప్రణాళిక వేసి గాంధీ సిద్ధాంతాలపై ఇరవై పుస్తకాలు ప్రచురించి వంద పేజీల పుస్తకాన్ని వంద పైసలకు అందించారు.

తన జిల్లాలో పెదనింద్రకొలనులో వారి కలల సాకారంగా నిర్మించిన 'మహాత్మాగాంధీ' భవనం రాజుగారి ఆశయాలకు ప్రతీకగా నిలుస్తుంది. దాదాపు కోటి రూపాయలు వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ భవనానికి 1969లో మొరార్జీదేశాయ్ శంకుస్థాపన చేశారు. ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో వంద అడుగుల వ్యాసార్థంతో తెరిచిన గొడుగును పోలి ఉండేలా దీనిని నిర్మించారు. భారతపార్లమెంటు భవనాన్ని పోలి ఉన్న ఈ భవనానికి ప్రముఖ ఇంజనీరు పి.వి. రాజు రూపకల్పన చేశారు.

ఈ భవనం భూమికి తాకకుండా వుండే విధంగా వేలాడే గదులు, మెట్ల సముదాయాలతో నిర్మించడం సందర్శకులకు విచిత్రానుభూతి కలుగుతుంది. సినీ చిత్రకళాదర్శకునిగా ప్రఖ్యాతిగాంచిన కౌతాగారు చిత్రించిన అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షపీఠాన్ని అలంకరించిన వ్యక్తులందరి వర్ణచిత్రాలను వేయించి భవనంలో పెట్టారు. మహాత్ముని జీవితఘట్టాలను గోడలపై చిత్రించడంతో పాటు భవనం మధ్యలో పసిడివెన్నెలలో ఉన్న గాంధీగారి విగ్రహం భవనశోభను ఇనుమడింపచేస్తుంది. ఒక చేతిమీద ఇంతటి నిర్మాణం ఎలా చేశారన్నది ఆశ్చర్య కరం. కాని మహాత్ముని పట్ల ఆయనకున్న అపారప్రేమకిది నిదర్శనం. గాంధీకి సంబంధించి చిన్న, పెద్ద ఏరూపంలో, ఏవస్తువు ఉన్నా సేకరించేవారు. అదే వారి దేవాలయం.

మూర్తిరాజుగారి 91వ జయంతి సందర్భంగా వారి అభిమానులు బ్రస్ట్‌సైజు విగ్రహాన్ని రూపొందించి గాంధీభవనంలో ప్రతిష్టించాలని కోరగా ససేమిరాయని ఒప్పుకోని మహామనిషి. స్వప్రచారంకోసం తిమ్మిని బమ్మిని చేస్తున్న ఈ రోజులలో తాను నిర్మించిన భవనంలో తన విగ్రహాన్ని పెట్టడాన్ని నిషేధించిన ఏకైక వ్యక్తి!

విజయవాడలోని గాంధీహిల్‌కు అధ్యక్షులుగా తనదైన రీతిలో సేవలందించారు. ముందుగా గాంధీ పర్వతంపైనున్న గ్రంథాలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. సిరీస్ రాజుగారి నుండి లక్ష రూపాయల విరాళాన్ని సేకరించి, ఆ ధనంతో మౌలిక సదుపాయాలతోపాటు చాలా పుస్తకాలు సేకరించారు. బాపు ఫోటోలతో మంచి ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయించారు. 1990లో వీరు చేపట్టిన శాంతిసేన కార్యక్రమం అపూర్వమైనది. విజయవాడలో మొత్తం 50 వార్డులున్నాయి. పూటకొక వార్డు చొప్పున నెల రోజులపాటు జనవరి 1న ప్రారంభమయి జనవరి 30 నాటికి గాంధీ పర్వతంలో అడుగుపెట్టిందీ శాంతిసేన. పాదయాత్ర అనంతరం ప్రతివార్డులోను నిర్వహించిన శాంతి సమావేశాలలో నాటకాలు, హరికథలు, బుర్రకథలు ఏర్పాటు చేశారు.

గాంధీకి సంబంధించి రకరకాల కార్యక్రమాలు చేపట్టి వ్యయానికి వెరవక మహాత్మునిపై ఉన్న గీతాలన్నింటిని సేకరించి నాద వినోదిని సంస్థ తరఫున పాలగుమ్మి విశ్వనాథం సంగీత సారథ్యంలో జాతీయ గేయమాలిక పేరుతో పాటల సి.డి. క్యాసెట్‌లను తయారు చేయించారు. ప్రయాణాలలో కారులో ఎప్పుడూ ఇవే పాటలు తన్మయత్వంతో వింటూండేవారు.

రాజకీయ రంగంలో భీష్మాచార్యులని చెప్పవచ్చు. చిన్నతనంలోనే జిల్లా బోర్డులో ప్రవేశించి ఆలోచనత్మాకమైన, సాహసోపేతమైన కార్యక్రమాలు చేపట్టి విజయశంఖం పూరించారు. 1952 నుండి 1982 వరకు తాడేపల్లి గూడెం, ఉంగుటూరు, పెంటపాడు నియోజకవర్గాల నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొంది ప్రజాహిత కార్యక్రమాలెన్నో చేపట్టారు. మార్కెటింగ్, గిడ్డంగులు నిర్మించారు. దేవాదాయ శాఖమంత్రిగాను, ప్రోటెం స్పీకర్‌గా పనిచేసిన మహామనిషి.

**- డాక్టర్ రావి శారద గారికి కృతజ్ఞతలతో**

**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

**81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.**
**Phones : 28152387, 28154653**

***The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation***

# అక్షరాన్ని పరబ్రహ్మంగా నెంచి ఆరాధించినవారు వావిళ్ళవారు!!

## - రామస్వామిశాస్త్రులు - వేంకటేశ్వరశాస్త్రి కృషి వ్యాసవాల్మీకుల కద్దం పట్టింది -

వావిళ్ల వంశోద్భవులు రామస్వామి శాస్త్రులు వేంకటేశ్వర శాస్త్రులిరువురూ వ్యాసశుకులు వంటివారు. వివరంగా చెప్పాలంటే వాల్మీకి, వ్యాసుల వ్యాసంగాన్ని క్షీరసాగరమదనంలా మదించి, మదించి సాహిత్య జనావళికి అందించారు.

వావిళ్ళ రామస్వామి శాస్త్రి సంస్థ లేనిచో చాలాచాలా పురాణేతిహాస గ్రంథాల సారాన్ని మనం కోల్పోయేవారం. తెలుగుజాతి ఉన్నంతవరకూ 'వావిళ్ళ' వంశకీర్తిని స్తుతించవలసి ఉన్నది. కానీ తెలుగుజాతికి 'వావిళ్ళ' జ్ఞాపకం ఉన్నదా అన్నదే నా ప్రశ్న. సమాధానం చిక్కని ప్రశ్నయని తెలుసు! తెలుగువారిలో కృతజ్ఞతాభావం, విధేయతా సన్నగిల్లిందని తెలుసు.

వాణిని వాగ్వాణిగా తీర్చిదిద్దిన సంస్థ వావిళ్ళ. 1854 సం॥ము ఫిబ్రవరిలో చెన్నపురిలోని చాకలిపేటలో 'సరస్వతీ నిలయము' అనుపేరిట ఒక గ్రంథ ప్రచురణ సంస్థనూ, ముద్రాలయములను వావిళ్లరామస్వామి శాస్త్రులు అనే పండితోత్తముడు స్థాపించాడు. ఆయన నెల్లూరువాడు. తిక్కన సోమయాజి పుట్టిన సింహపురి గడ్డవాడు. సాంప్రదాయ సాహితీవనంలో సింహంలా దూసుకునిపోయి, ఎందరెందరో పూర్వకవుల సంపదను తెలుగులకు అందించి, తెలుగు విజ్ఞాన వెలుగుకు మార్గదర్శనం చేసినవాడు.



రామస్వామి శాస్త్రులు



వేంకటేశ్వరశాస్త్రులు

నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా లోని కుగ్రామం వావిళ్ళ గ్రామం. గ్రామంలో ఉన్నప్పుడే వేదం, వ్యాకరణం అభ్యసించారు. చెన్నపురి వచ్చి తమ వేదాధ్యయనాన్ని మరింత పదును పెట్టారు. మైసూరు వెళ్ళారు; మహారాజా కృష్ణరాజ వడయారును కలిసారు. కన్నడం నేర్చుకున్నారు. చెన్నపురి వచ్చారు. సింహకిశోరులు కదా, జూలువిప్పినట్లు తెలుగు అక్షఱ అచ్చుల ఫాంట్లను తామే పోసుకున్నారు. యి.బి. జి.పి ఫాంటుల వాడుకను హెచ్చుగా ప్రవేశపెట్టినది వారే. కానీ వారు 'వావిళ్ళ' పేరును నామ ఫలకంగా తీర్చిదిద్దలేదు. కాళిదాసు 'వాణి నా రాణి' అన్నట్లుగా సరస్వతినే సంస్థపేరుగా 'సరస్వతీ నిలయం'గా పేరు పెట్టుకున్నారు. సరస్వతీ అనుగ్రహంతోనే 'శ్రీమద్రామాయణం' గ్రంథాన్ని విడుదల చేసారు. ఆదికవిగా ప్రణతులర్పించడాన్ని చెన్నపురి పౌరులు చంద్రమందహాసులై, ఏనుగుమీద ఆ రామాయణ ప్రతుల నధిష్టింపచేసి, ఊరంతా ఊరేగింప చేసారు. ఆదికవి రామాయణం ఆంధ్ర గ్రంథానికి తొలిగజారోహణం జరిగింది. అప్పటి చెన్నపురి తెలుగువారెంతటి అదృష్టవంతులో! అలా రామస్వామిశాస్త్రులుగారు 50 గ్రంథాలను అచ్చువేసి జనావళికి అందించారు. ఆనాడు గ్రంథం అచ్చువేయడమంత ఆషామాషీకాదు; పండిత పరిశీలనం జరగాలి. శుద్ధ వ్రాతప్రతి తయారు కావాలి. గ్రంథపుటచ్చుకూర్పు జరిగిన తరువాత ఒక్కొక్క అక్షరమునే తప్పులు లేకుండా చూడాలి. క్రావడులు, అరసున్నలూ, వ్యాక్యాల మధ్య విరామాలు (అవే కామాలు) వాక్యం పూర్తి అయిన తరువాత పూర్ణ విరామం (ఫులుస్టాపు) సరిగా ఉండాలి. ఏదైనా తప్పుదొరలినచో వాక్య సౌందర్యం పోవడమే కాదు, అర్ధం మారిపోతుంది. గ్రంథం విడుదలైన తరువాత- ఈ అనర్థాలను పట్టుకుని తెలియజేసే విజ్ఞులకు తప్పుకు అర్ధరూపాయిస్తామని ప్రకటించేవారు. ప్రతీగ్రంథములోనూ చక్కని పీఠిక ఉండేది. తత్కగ్రంథకర్త కాలవిశేషాలను ప్రకటించాలి. ఇలా 'రామాయణం' తరువాత మరో 49 గ్రంథాలు రామస్వామి శాస్త్రులుగారి కాలంలో ప్రచురితమయ్యాయి. మూల్యం కూడా చదువరుల కందుబాటులో ఉండేది. రామస్వామిశాస్త్రులుగారు 1891 సం॥ములో మరణించారు. వారి మరణాన్ని ఎంతలోటుగ ఎందరో పుణ్యచరితులు భావించారు. అప్పట్లో మద్రాసు విశ్వవిద్యాలయంలో పాలితులుగా ఉండే ఓ కార్యవర్గసభ్యుడు వర్గవర్ణ భాషా వర్ణముల కతీతుడైనవాడు 'వావిళ్ళ రామస్వామి శాస్త్రులు. వారి మరణం ఓ రాముణ్ణి పోగొట్టుకుందన్నారు. ఆయన ఉభయభాషలకూ సంజీవని వంటివారు. దక్షిణ భారతంలో రామాయణ భారత గ్రంథాలను అచ్చువేసిన ఖ్యాతి ఆయనిదే. ఆ గ్రంథాలకు గజారోహణార్హతలను కల్గించినదీ రామస్వామి శాస్త్రులుగారే అన్నారు.

రామస్వామి శాస్త్రులుగారు మరణించిన అనన్తరమ్ కొంతకాలం సరస్వతీ నిలయం, ముద్రణాలయ పనులు నిలిచిపోయాయి.

**1906** సం॥ములో రామస్వామిశాస్త్రిగారి కుమారుడు వేంకటేశ్వరశాస్త్రులుగారు బాధ్యతలు చేబట్టే వరకూ సరస్వతీ నిలయం పనులు నిలిచిపోయాయి. ఆయన ఆంగ్లభాషాధ్యయనం కూడా చేసారు. ప్రచురణ సంస్థలో ముద్రణా కూర్పులో కొన్ని మార్పులు చేసారు. సంస్థ పేరును **వావిళ్ళగా** మార్పు చేసి వావిళ్ళరామస్వామిశాస్త్రులు సన్‌గా మార్చారు. స్వంతంగా అచ్చు తయారీ సంస్థను నెలకొల్పారు. 'త్రిలిజ్గ' అనే తెలుగు వారపత్రికను నెలకొల్పారు. **ఆ వారపత్రికలో పనిచేసిన అదృష్టం నాకు దక్కింది.**

వేంకటేశ్వరశాస్త్రులు గారికి దేశాభిమానం యెక్కువ. తండ్రిగారు అచ్చువేసిన గ్రంథ పునర్ముద్రణం తోపాటు ఇతర భాషల్లోని విలువైన నవలల్ని తెలుగులోకి అనువదింప చేసారు. అందులో బకిమ్ చంద్రముఖర్జీ 'ఆనంద మఠమ్' నవల పేర్కొనతగినది. సీతారామా చార్యులుగారి 'పెద్దబాలశిక్ష'నూ, చిన్నయసూరిగారి వ్యాకరణములనూ అచ్చునొత్తించారు. గ్రంథాలయముల్లో సాహితీవిలువగల క్లబ్‌లలో పోషక సభ్యత్వం పొందారు. అలాటి వాటిల్లో పేర్కొనదగినది మద్రాసు కాస్మోపాలిటిన్ క్లబ్. ఎందరో ప్రముఖ పండితులు, కవులు, రచయితలకు వావిళ్ళ ఆశ్రయంగా నిలిచింది. ఒకరకంగా చెప్పాలంటే ఆంధ్రభోజుడూ శ్రీకృష్ణదేవరాయలులా ద్విపాత్రలు పోషించిన ఖ్యాతి వేంకటేశ్వరశాస్త్రిగారిదే. ప్రసిద్ధ జాతీయ నాయకుడు బాలగంగాధర తిలక్ జైలులో ఉన్నపుడు వ్రాసిన గీతా రహస్యం భగవద్గీతవ్యాఖ్యానాన్ని నోరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే తెనిగింపచేసి ప్రచురించారు. బాలలకోసం 'బాలవినోదిని' పత్రికనూ, ఫెడరేటెడ్ ఇండియా' ఆంగ్ల వారపత్రికనూ నడిపారు. పురాణం హయగ్రీవశాస్త్రిగారిచే పోతన భాగవతాన్ని యధాతథంగా ప్రచురిస్తూ వ్యాఖ్యానం వ్రాయించారు. వేంకటేశ్వర శాస్త్రిగారు రామస్వామి శాస్త్రులుగారు ముద్రించిన గ్రంథాలను లండనులోని మ్యూజియమ్‌లో ఉంచడం తెలుగువారి విఖ్యాతికి నిదర్శనం.

వావిళ్ళ రామశాస్త్రులు వారి కాలం నుంచీ గ్రామగ్రామాలూ తిరిగి రచయితల గ్రంథాలను సేకరించి పరిష్కరించి గ్రంథ ప్రచురణ చేయడం గొప్ప విషయం. వావిళ్ళ అనే వటవృక్షాన్ని గురించి వివరించడం సాధారణ విషయం కాదు, సాహసం!

(లోగడ 'ప్రముఖాంధ్ర' సంచికల్లో పలు వావిళ్ళ విషయాల్ని ప్రచురించాం. ముందు కూడా ప్రచురించగలం)

అయితే వేంకటేశ్వరశాస్త్రిగారి చివరిదశ పక్షవాతంతో మంచానికే అంకితమైననూ, సాహితీ గ్రంథరచనం ఆగిపోలేదు. 1956 సం॥ములో ఏడుపదులకు చేరకుండానే మరణించడం సాంప్రదాయ సాహితీరంగం కూడా మరణించిందనే చెప్పాలి. ఇపుడు వారి వారసులెవరో గ్రంథ ముద్రణం ప్రారంభించారని వింటున్నాం. ముందు ముందు తెలుసుకుందాం. ●

**ప్రపంచ ఆంధ్రులు గర్వించ 'ప్రముఖాంధ్ర'కు మీ ప్రోత్సాహమేదీ!**

## రామ పరంధాముని నామస్మరణతో తుది శ్వాసవిడిచిన

# బెంగుళూరు నాగరత్నమ్మ

ఆమెగానం అమృతపానం. ఆమె చరిత్రం పరమపావనం. అనురాగమయి. అందరికీ తన గానామృతం ద్వారా అమృతం పంచి, తానుమాత్రం హాలాహలాన్ని కడుపులోనే దాచుకుంది. ఆమెకు సంతానంలేదు. ప్రేమగా ఉంటుందని ఓ ఆడపిల్లను పెంచుకుంది. ఆ పిల్లే వయసు వచ్చి ఊహలు తెలిసిన తరువాత నాగరత్నమ్మ ఆస్తిని కబళిద్దామనే పెను ఆశతో విషప్రయోగంతో చంపాలనుకున్నది. అది తెలుసుకున్న నాగరత్నమ్మ– ఆమెకు యివ్వాల్సిన ఆస్తినిచ్చి, పూర్తిగా ఆధ్యాత్మిక చింతనురాలైయుంది.

రాతిని నాతిని చేసిన రామ నామగానమునే తన వ్యాపకం చేసుకున్నది. ఎక్కడ ఎవరు పిలిచినా రామనామ గానమును కర్ణాటక సాం్రపదాయంతోనే గానం చేసి మురిపించేది. ఆమె మీరాబాయియా, లతా మంగేష్కరా, ఎం.ఎస్. సుబ్బలక్ష్మియా, ఎం.ఎల్. వసంత కుమారియా, పట్టమ్మాళ్, అవ్వైయారా అని అను సాంప్రదాయ పిలుపులు కాకుండా 'బెంగుళూరు రామరత్నం' అనే సంపూర్ణ నామ ధ్యేయాన్ని, గాన శ్రవణోపేయ మధురిమలను నాస్వాదించిన గానరసికులే చెబుతారు. త్యాగరాజస్వామివారు కలలో దర్శనమివ్వడమూ పురాకృతం. ఆమె మకాము తిరువాయూ రుకే మార్చివేసింది. మొదట ఆ స్వామిని వృద్ధ బ్రాహ్మణ మూర్తిగా చూచింది. చేత తంబూర ఉండడంతో త్యాగరాజ స్వామివారని నిర్ణయించుకుంది. తన గానా మృతంలో కేంద్ర బింబము శ్రీరామచంద్రుడే, త్యాగరాజులవారి సంకీర్తనములు కూడా రామనామ లయములే! సంగీత పరగోత్రములు కలిసాయి. దేవదాసి ప్రవర్తితయైన నాగరత్నమ్మ దేవుని దాసిగానే తలచుకున్నది. దేవుని సంకీర్తనమే ముక్తిదాయక మనే ధోరణినిని పెంచుకున్నది. రామనామం తోనే బంధం పెట్టుకున్న నాగరత్నమ్మ త్యాగబ్రహ్మ త్యాగరాజును తన నాదబ్రహ్మగా చేసుకున్నది.



తిరువాయూరును దర్శించగానే త్యాగరాజస్వాములవారి సమాధి శిథిలావస్థలో ఉండడం, ఆమెను నిలువునా దహింపవేసింది. తన యావదాస్తినీ విక్రయించగా వచ్చిన 50 లక్షల రూపాయల ధనంతో త్యాగరాజ స్వామివారి సమాధిని 'త్యాగరాజబృందావన ఆలయంగా పునరుద్ధరించడం, యాత్రికుల సౌకర్యార్థం త్యాగబ్రహ్మ నిలయం, సంగీతాభ్యాసుల కోసం గురుకులం త్యాగరాజస్వామిని ఆరాధనోత్సవంలో సమిష్టి గానం చేయడాని కనువుగా సమాధి ముంగిటే సమష్టిగానాని కనువుగా కొలువు ప్రాంగణం నిర్మించడమే గాకుండ, సమాధి చుట్టూ వున్న భూములను కొనుగోలు చేసింది. ఇదంతా 1933 – 35 సం॥ల మధ్య జరిగిన అభివృద్ధి. 1940 సంవత్సరంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలను పంచకీర్తనా సంభరితంగా, పెద్ద విద్వాంసులచే ప్రారంభం చేయించినది కూడా నాగరత్నమ్మే. తన ఆదాయవనరులు క్షీణించినా ప్రత్యేక ప్రతిభలు గల గాన విద్వాంసులందరూ ఆరాధనంలో పాల్గొనడం ఆమెకో సంతృప్తిని కలుగచేసింది. అటుపిమ్మట తన పూర్తి జీవితాన్ని త్యాగరాజస్వామివారికే అంకిత పరచుటకు అక్కడే నివాసమున్నది. త్యాగరాజులవారు తిరువాయూరు వీథుల్లో భిక్షమెత్తి తిరిగినట్టు రామ రత్నమ్మ తిరు వాయూరు వీధుల్లో త్యాగరాజ సంకీర్తనం చేస్తూ తిరిగేది. తనకున్న యితర ఆస్తులన్నిటినీ విక్రయించి, త్యాగరాజస్వామి పేరిట ఒక ట్రస్టును ఏర్పాటు చేసింది. ఆ ట్రస్టు క్రమం తప్పకుండా త్యాగరాజ ఆరాధనోత్స వాలు జరపాలనే ఉద్దేశం ఆమెలో నెలకొంది. తిరువాయూరులోనే ప్రశాంత జీవితం నెఅపడానికి నిర్ణయించుకున్నది. ప్రతీ సంవత్సరమూ ఆమె వెంకటగిరి రాజావారు జరిపే నవరాత్రి మహోత్స వాల్లో కచ్చేరీలు చేసివచ్చేది. చెన్నపట్నంలోని సంగీత కచ్చేరీలకు మాత్రమే వెళ్లేది. నాగరత్నమ్మ అవిరామ, రామాంకితి సేవను మెచ్చిన డా॥ కె.యస్. కేసరిగారు 'గృహలక్ష్మి స్వర్ణ కంకణం తొడిగి గౌరవించారు. భగవాన్ సత్యసాయిబాబా వారు శ్రీరాముని విగ్రహం సృష్టించి యిచ్చారు. అప్పట్నుంచీ ఆమెలో వైరాగ్యభావం పెరిగిపోయింది. రామవిగ్రహం వొడిలో పెట్టుకుని రామాంకిత ధ్యాసలోనే కాలం గడిపిన ఆమెను అపర రామదాసు అనవలెనో, అపరత్యాగరాజు అనవలెనో, అపరమీరాబాయి అనవలెనో, పురంధరదాసు అనవలెనో పాఠకులే నిర్ణయించండి. కానీ అపర నాగరత్నమ్మ లుంటారనలేము – అంటే బెంగుళూరు నాగరత్నమ్మకు సమలెవరూ లేరు. దురదృష్టమేమంటే ఆమె తన తనువు చాలించిన అనన్తరం త్యాగరాజస్వామివారి సమాధి ప్రక్కనే ఖననం చేయమన్నది. ఛాందసులు కొందరు ఆమె దేవదాసీయని అభ్యంతరం చెప్పారు. అర్థంలేని వారి మాటలను త్రోసి పుచ్చి, నిరోధించినవ వారిని అనుకూలురుగా చేసి ఓ వంద అడుగుల దూరంలో ఖననం చేసి, త్యాగరాజస్వామివారికి నమస్కారం పెడుతున్నట్టుగా ఆమె విగ్రహాన్ని నెలకొల్పారు.

నాగరత్నమ్మ ప్రాణాలను విడిచిన విశేషమునిందు ఘనంగా చెప్పుకోవాలి! ఆమె అనుంగు శిష్యుడగు రాముడు భాగవతార్ కుమారుడు ప్రక్కనున్న కావేరిలో మునిగి చనిపోయాడు. వాడి పార్థివదేహాన్ని తన యింటి ముంగిటగా తీసుకుని పోవడం వాలు కుర్చీలో కూర్చుని చూస్తూ ఛాతీమీద చేయివేసుకుని అలాగే క్రిందపడిపోయింది. వెంటనే అక్కడివారు వైద్యులను పిలిపించారు. వారు ఇంజెక్షన్ యివ్వబోతున్నారు. రామ నామాంకితమూ, త్యాగబ్రహ్మపరమైన ఈ శరీరంలో సూది మోపిన స్థలం కూడా సూది పొడవడానికి అంగీకరించనని చెబుతూ, తన నేస్తమైన పచ్చాయనిని చాప పరచి కూర్చోమని ఆమె వొడిలో తన తలను పెట్టుకుని శ్రీరామాంజ నేయ స్మరణను చేస్తూ, త్యాగరాజులవారికి వందనం చేస్తూ రామ నామం పలుకుతూ ఉదయం పదిన్నర గంటలకు రామునిలో ఐక్యమైనట్టుగా ఆమె ప్రాణతేజం అంతర్హితమైంది.

భగవాన్ సత్యసాయిబాబావారు ఏభావంతో శ్రీరాముని విగ్రహాన్ని సృష్టించి ఆమెకు ప్రదానం చేశారోగాని, అప్పట్నుంచీ ఆ విగ్రహాన్ని వొడిలోనే ఉంచుకుంటూ, అహరహమూ రామనామ ధ్యానంలోనే ఉండిపోయిన ఆమెను మహోన్నత గుణరాశి అనవలెనా? మిన్నయైన పరమభక్తురా లనవలెనా– సత్యసాయి శ్రీరాముని విగ్రహాన్నే ఎందుకు ప్రదానం చేసారు!

ఆమె పార్థివదేహాన్ని ఓ రథమున, త్యాగయ్య విగ్రహాన్ని ప్రక్కన ఉంచి తిరువాయూరు తిరువీథుల్లోని జనులంతా రామనామ జపాన్ని చేస్తూ ఊరేగించారు. ఆమె చివరి శ్వాసలో 'రా' అనే అక్షరం తెరచుకుని, 'మ' అక్షరంతో మూసుకున్నందు వల్లనే వదనము ప్రశాంతంగా ఉన్నది. పెదవులు చిరునగవు చిమ్మినట్లుగా ఉన్నాయి. పార్థివ దేహమా లేక పార్థ స్వరూపమా అన్నదెవరికీ అవగతం కాలేదు. కొన్నాళ్ళ వఱకూ తిరువాయూరు జనులకు ఆమె 'రామనామ' సంకీర్తనంతో సంచరిస్తున్నట్లు గానే భావించారు. సత్పాత్రులకు మరణం లేదన్నది సత్యమే. 74 సం॥రములో ఆమె జీవన యాత్ర ముగిసింది. ●